

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

శుక్రవారం
20 నవంబర్ 2026





2029లో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం: సీఎం రేవంత్ రెడ్డి

- సిద్దిపేట జిల్లా అభివృద్ధికి రూ.544.11 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
- మదన్ మోహన్ రావు సేవలకు గుర్తింపుగా సిద్దిపేట వైద్య కళాశాలకు ఆయన పేరు
- సిద్దిపేట నుంచి గెలిచిన ఎమ్మెల్యేకు రాబోయే ప్రభుత్వంలో మంత్రి పదవి ఇస్తా
- మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు, పెండింగ్ పరిహారం పూర్తిస్థాయిలో చెల్లిస్తాం
- మహిళల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- సిద్దిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సిద్దిపేట బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, 2029లో మరోసారి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చి రెండోసారి ప్రజాపాలన జెండా ఎగురవేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా పర్యటనలో భాగంగా ఆయన రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు.

ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిద్దిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మదన్ మోహన్



రావు సేవలను గుర్తిస్తూ సిద్దిపేట వైద్య కళాశాలకు ఆయన పేరు పెట్టాలని, దీనికి సంబంధించిన ఉత్తర్వులు 24 గంటల్లో జారీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని ఆదేశించారు. సిద్దిపేట నుంచి గెలిచిన ఎమ్మెల్యేకు రాబోయే ప్రభుత్వంలో మంత్రి పదవి ఇస్తానని ప్రకటించారు.

రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులు...

సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఆరు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, చిన్నకోడూరు, దౌల్తాబాద్‌లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.451.13 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. మరో రూ.92.98 కోట్లతో నిర్మించిన 14 విద్యుత్ సబ్‌స్టేషన్లు, కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సత్రం, క్యూ కాంప్లెక్స్, గ్రామ సంఘాల భవనాలు, కేజీబీవీ భవనం, విద్యుత్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత...

మహిళల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. కోటి మంది మహిళలకు నాణ్యమైన చీరలు పంపిణీ చేశామని, నవంబర్ 26న రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం *మిగతా 13లో..*

చలికి వణుకుతున్న
మూగజీవాలను ఆదుకోవాలి



చేర్యాల, నవంబర్ 19 (జనంసాక్షి): జిల్లాలో చలి తీవ్రత పెరుగుతుండటంతో చేర్యాల పట్టణం, పరిసర గ్రామాల్లోని కోతులు, ఇతర మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తెల్లవారుజామున పొగమంచు, చలిగాలులకు కోతులు చెట్ల కొమ్మల్లో ముడుచుకుని, ఒకదానికొకటి హత్తుకుని కనిపిస్తున్నాయి. చెట్లు తగ్గిపోవడంతో వాటికి సరైన ఆశ్రయం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాలకు ఆహారం, నీరు అందించడంతో పాటు చలి నుంచి రక్షణకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ప్రకృతి ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మనుషులతో పాటు మూగజీవాలను కూడా మానవత్వంతో ఆదుకోవాలని కోరుతున్నారు.

పేకాట స్థావరంపై
పోలీసుల మెరుపు దాడి

- 10 మంది అరెస్టు.. రూ.18,200 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం



చిన్నంబావి, నవంబర్ 19 (జనంసాక్షి): మండల పరిధిలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి 10 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.18,200 నగదు, 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామన్ గౌడ్ తెలిపారు. దగడపల్లి, పెద్దదగడ, బెక్కెం, గూడెం, పెద్ద మారూరు గ్రామాలకు చెందిన వ్యక్తులు పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని
ఆవిష్కరించిన డాక్టర్ వెన్నెల గద్దర్

- బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం గద్దర్ చేసిన పోరాటాన్ని కొనసాగిస్తాను
- గద్దర్ ఆశయాలు కొనసాగిస్తాం
- ప్రజా సంఘాల నాయకుడు ఎత్తం కృష్ణయ్య



వీపనగండ్ల, నవంబర్ 20 (జనంసాక్షి): వీపనగండ్ల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ప్రజాయుద్ధనౌక, ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటుకు ఎత్తం కృష్ణయ్య అలియాస్ జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడంతోఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ కుమార్తె తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ప్రజా ఉద్యమ నాయకుడు ఎత్తం కృష్ణయ్య అలియాస్ జనార్దన్ ఆహ్వానం మేరకు ఆమె ఈ కార్యక్రమంలో *మిగతా 13లో..*

భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అత్యవసరం: సైబరాబాద్ సీపీ డాక్టర్ రమేష్

రూ.80 లక్షలతో అమీన్‌పూర్‌లో 153 కెమెరాల ప్రారంభం



అమీన్‌పూర్, నవంబర్ 19 (జనంసాక్షి): నేరాల నియంత్రణకు, నేరస్థులను త్వరితగతిన గుర్తించి పట్టుకోవడానికి సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.80 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 153 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు.



ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నేరం జరిగిన తర్వాత నేరస్థులను పట్టుకోవడం కంటే, అసలు నేరాలు జరగకుండా నివారించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా పటాన్‌చెరు, అమీన్‌పూర్ వంటి పారిశ్రామిక ప్రాంతాలకు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ఉపాధి కోసం వస్తున్నారని చెప్పారు. రద్దీ ప్రాంతాల్లో నేరాలకు పాల్పడి ఇతర రాష్ట్రాలకు పారిపోయే వారిని గుర్తించడం పోలీసులకు సవాలుగా మారుతోందన్నారు. ఆధునిక కెమెరాల ద్వారా అనుమానితుల కదలికలను నిరంతరం పర్యవేక్షించవచ్చని, నేరస్థులు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు.

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ పోలీసుల ఒక్కరి వల్లే సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. సీసీ కెమెరాల ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, కాలనీ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్ వాసులు తమ పరిసరాల్లో సొంతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని కమ్యూనిటీ పోలీసింగ్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాసరావు, అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, రామచంద్రపురం ఇన్‌స్పెక్టర్ లాలూ నాయక్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

దశలవారీగా ఇందిరమ్మ బీమా నమోదు: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మూడు విడతల్లో లబ్ధిదారుల నమోదు.. గ్రామాలు, వార్డుల్లో శిబిరాలు



గద్వాల నడిగడ్డ, నవంబర్ 19 (జనంసాక్షి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను నూతన విధివిధానాల ప్రకారం పకడ్బందీ గా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో పథకం అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మూడు విడతల్లో లబ్ధిదారుల నమోదు చేపట్టాలని, శుక్రవారం నుంచి మొదటి విడత ప్రారంభించాలని సూచించారు.

మొదటి విడతలో ఇంటర్నెట్, కంప్యూటర్ సదుపాయాలు, చురుకైన సిబ్బంది అందుబాటులో ఉన్న గ్రామాలు, మున్సిపల్ వార్డులను ఎంపిక చేయాలని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మిగిలిన విడతల షెడ్యూల్‌ను కూడా త్వరగా సిద్ధం చేయాలన్నారు.

నమోదు ప్రక్రియ సరళీకరణ...

సవరించిన మార్గదర్శకాల ప్రకారం ప్రీ-ఫిల్డ్ దరఖాస్తులు, మాన్యువల్ ఫారాలు, ప్రింటింగ్, స్కానింగ్, పత్రాల అప్‌లోడ్ అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. రేషన్ కార్డు చివరి ఆరు అంకెలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు కనిపిస్తాయని, అందులో బీమా పొందే వ్యక్తి, నామినీలను ఎంపిక చేసి వాటా శాతాన్ని నమోదు చేయాలని వివరించారు. ఇతర బీమా పథకాల సభ్యత్వ వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. దరఖాస్తు పూర్తయిన వెంటనే ట్రాన్సాక్షన్ ఐడీ జారీ అవుతుందని, లబ్ధిదారుడి మొబైల్‌కు సందేశం వస్తుందని తెలిపారు.

రిజిస్టర్ నిర్వహణ తప్పనిసరి...

ప్రతి లబ్ధిదారుడి వివరాలు, సంతకాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. రేషన్ కార్డు నంబర్, బీమా పొందే వ్యక్తి, నామినీ పేరు, వాటా శాతం, ట్రాన్సాక్షన్ ఐడీతో పాటు క్యాంప్ ఇన్‌చార్జి, పర్యవేక్షణ అధికారి సంతకాలు తీసుకోవాలన్నారు. తప్పు మొబైల్ నంబర్లు నమోదు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

శిబిరాలపై విస్తృత ప్రచారం...

గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్, ఇతర సౌకర్యాలతో శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. టామ్‌టామ్, ఫ్లెక్సీలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు ఉంటే పౌరసరఫరాల శాఖ ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. అర్హులైన కుటుంబాల నమోదుకు పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు,తహసీల్దార్లు,మున్సిపల్‌కమిషనర్లుపాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతపై నిర్లక్ష్యమెందుకు?

- వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలి.. సీపీఐ డిమాండ్



బెజ్జంకి, నవంబర్ 19 (జనంసాక్షి): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయి నాలుగేళ్లు గడుస్తున్నా నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలను సందర్శించిన సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, సహాయ కార్యదర్శి సంగెం మధు ప్రహరీ గోడను పరిశీలించారు. రూ.18 లక్షలు మంజూరైనా ప్రజాప్రతినిధుల వర్గపోరు కారణంగా పనులు ప్రారంభం కాలేదని రూపేష్ ఆరోపించారు. ప్రహరీ లేక పందులు, పాములు పాఠశాలలోకి వస్తున్నాయని, విద్యార్థినుల భద్రతకు ముప్పు ఏర్పడిందన్నారు. వెంటనే నిర్మాణ పనులు చేపట్టకపోతే తల్లిదండ్రులతో కలిసి రాజీవ్ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ నాయకుల
ముందస్తు అరెస్టులపై ఖండన



కొండపాక, నవంబర్ 19 (జనంసాక్షి): సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేట సభ నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి కుకునూరుపల్లి, తొగుట పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని మాజీ జెడ్పీటీసీ అనంతుల అశ్విని ప్రశాంత్, దేవి రవీందర్ ఖండించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే అరెస్టులు కాకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. దేవాదుల ప్రాజెక్టు, తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపడంతో పాటు పెండింగ్ కాలువల పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సర్వేపై గ్రామసభలో అవగాహన!

- భూముల హద్దులు, రికార్డుల నమోదు ప్రక్రియపై రైతులకు వివరించిన అధికారులు!



బాలానగర్, నవంబర్ 19(జనంసాక్షి):

బాలానగర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన భూ సర్వే కార్యక్రమంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుమ్మళ్ల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భూ సర్వే ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా అధికారులు భూ సర్వే నిర్వహణ విధానం, భూముల హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల వివరాలు, రైతులకు సంబంధించిన పలు అంశాలపై వివరంగా చర్చించారు. భూ సర్వే ద్వారా భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంటుందని తెలిపారు.

రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి, భూ సర్వే ప్రక్రియకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో న్యాల్‌కల్ కస్తూర్బా బాలికల ప్రతిభ

- కోకో, వాలీబాల్‌తో పాటు అథ్లెటిక్స్‌లోనూ సత్తా

న్యాల్‌కల్, నవంబర్ 19 (జనంసాక్షి): నారాయణ ఖేడ్‌లో నిర్వహించిన పీఎం శ్రీ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో న్యాల్‌కల్ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభ చాటారు.



గురువారం నిర్వహించిన అండర్-17 విభాగం పోటీల్లో పది పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. కోకో, వాలీబాల్, 100, 200, 400 మీటర్ల పరుగుపందెం, షార్ట్‌పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించారు. కోకో, వాలీబాల్ పోటీల్లో న్యాల్‌కల్ విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించారు. 100 మీటర్ల పరుగులో నందిని ప్రథమ, సుహాసిని ద్వితీయ, అక్షయ తృతీయ స్థానాలు పొందారు. 200 మీటర్లలో శిల్ప ప్రథమ, సమంత ద్వితీయ స్థానాలు సాధించారు. 400 మీటర్ల పరుగులో అక్షయ ప్రథమ, సమంత తృతీయ స్థానంలో నిలిచారు. షార్ట్‌పుట్‌లో మీరా ప్రథమ, పావని ద్వితీయ స్థానాలు సాధించగా, డిస్కస్ త్రోలో సౌమ్య ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థినులు పలు విభాగాల్లో విజయాలు సాధించడంపై గురుకుల ప్రత్యేకాధికారిణి లలిత, పీఈటీ భూమిక, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులను అభినందించారు.



కవితక్కను ముఖ్యమంత్రిని చేయడమే మా ధ్యేయం

ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ రక్షణ సేన లక్ష్యం: చెన్నమల్ల చైతన్య



బెజ్జంకి, నవంబర్ 19 (జనంసాక్షి): తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బెజ్జంకి మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రవెల్లి మహేందర్ పటేల్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా హాజరైన మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ మండలంలోని పరిశ్రమల కాలుష్యం, మౌలిక వసతుల కొరత, సంక్షేమ పథకాల అమలుపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రవేశపెట్టిన పాంచజన్య సూత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం, యువతకు ఉపాధి, రైతులకు సంక్షేమం అందించడమే లక్ష్యమన్నారు. కవితక్కను ముఖ్యమంత్రిని చేయడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వెల్దండ, నవంబర్ 19 (జనంసాక్షి): మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వేముల లక్ష్మమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.40 వేల చెక్కును గురువారం అందజేశారు.

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఈ ఆర్థిక సాయం మంజూరైనట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తిరుపతి నాయక్, కేశమల్ల మమత అనిల్, మాడుగుల వెంకటయ్య, గంగాపురం శ్రీశైలం, ధన్ మంత్రి, జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్-నినో
ప్రభావాలపై రైతులకు అవగాహన

- ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పాటించాలి
- మండల వ్యవసాయ అధికారి దీపిక



నర్సాపూర్, నవంబర్ 19 (జనంసాక్షి): ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దీపిక సూచించారు. గురువారం రూప్‌సింగ్ తండా, ఎర్రకుంట తండాల్లో నిర్వహించిన గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలని, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ జొన్న, మొక్కజొన్న, పెసర, అలసంద, మినుము, శనగ, నువ్వులు, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. వరి సాగు తగ్గించి జీరో ప్యాడీ విధానాన్ని ప్రోత్సహించాలని, ఆయిల్‌పామ్ సాగు, సూక్ష్మ నీటిపారుదల, నీటి సంరక్షణ పద్ధతులపై వివరించారు. తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందే స్థిరమైన వ్యవసాయ విధానాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సీపీఎస్ ప్రహారీ
నిర్మాణ పనులకు శంకుస్థాపన



పెద్ద శంకరంపేట, నవంబర్ 19 (జనంసాక్షి): పెద్ద శంకరం పేటలో సీపీఎస్ ప్రహారీ గోడ నిర్మాణ పనులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షాకిర్ అలీ, సర్పంచ్ జంగం రేణుక, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెర మండ్ల గౌడ్, నాయకులు మధుసూదన్, మురళి పంతులు, దానంపల్లి నారాగౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతి నిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం



గోపాలపేట, నవంబర్ 19 (జనంసాక్షి): మాజీ ప్రధాని ఇం దిరా గాంధీ 109వ జయంతి వేడుకలను గోపాలపేట కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ సమగ్రత, పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయీకరణ, హరి త విప్లవానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో మంద సత్యశీల రెడ్డి, కొంకి వెంకటేష్, ధన్వాడ నాగరాజు, ఎండీ బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక తనిఖీలో భాగంగా కల్వకుర్తి డీఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

రికార్డుల నిర్వహణ, పోలీసు కార్యాలయ పనితీరుపై సమీక్ష

కల్వకుర్తి, నవంబర్ 19 (జనంసాక్షి): వార్షిక తనిఖీలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ గురువారం కల్వకుర్తి డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు.



ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి,వాటి నిర్వహణ తీరును సమీక్షించారు. పోలీసు శాఖకు సంబంధించిన పరిపాలనా వ్యవ హారాలు,రికార్డుల నమోదు, నిర్వహణ తదితర అంశా లను తనిఖీ చేశారు.



కార్యాలయ విధుల నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత పాటిస్తూ ప్రజ లకు మెరుగైన పోలీసు సేవలు అందిం చాలని సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా కార్యాలయ పనితీరును పరిశీ లించి అవసరమైన సూచనలు చేసినట్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి డీఎస్పీ,కల్వకుర్తి సీఐ కుమార్, ఎస్సై కురుమూర్తి, కల్వకుర్తి రెండో ఎస్సై, వెల్దండ ఎస్సై యుగంధర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

- **కమ్యూనిటీ వన్ హెల్త్ వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం**
- **జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ**



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల పట్ల కమ్యూనిటీ వన్ హెల్త్ వాలంటీర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. కృష్ణ సూచించారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వ ర్యంలో, యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) ఇండియా సాంకే తిక సహకారంతో కమ్యూనిటీ వన్ హెల్త్ వాలంటీర్లకు అవగాహన, శిక్షణ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు వ్యాపించే విధానాలు, వాటి వ్యాప్తి మార్గాలు, వ్యాధుల లక్షణాలు, ముందస్తుగా గుర్తించాల్సిన హెచ్చరిక సంకేతాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రేబిస్, క్యాసనూర్ ఫారెస్ట్ డిసీజ్, బర్డ్ ఫ్లూ, ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా తదితర జూనోటిక్ వ్యాధుల గురించి వివరించారు. వ్యాధుల సమాచారాన్ని సేతు మొబైల్ అప్లికేషన్ ద్వారా ఏ విధంగా నమోదు చేయాలి, సంబంధిత అధికారులకు ఎలా నివేదించాలి అనే అంశాలపై ప్రాయోగిక అవ గాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ కే. కృష్ణ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో వివిధ శాఖల సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ, పశుసంవర్ధకశాఖ, అటవీశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ వ్యాధుల గుర్తింపు, నివారణ, నియంత్రణ చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యాధులపై ముందస్తు సమాచారం సేకరించి, సకాలంలో నివేదికలు అందించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కే. రవికుమార్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్, యూఎన్‌డీపీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనిజ, ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి, డాక్టర్ ప్రవల్లిక, ఎపిడెమియాలజిస్ట్ ప్రవల్లికతో పాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

చలో సిద్దిపేట.. సీఎం సభకు చిలప్ చేడ్ కాంగ్రెస్ శ్రేణుల భారీ తరలింపు!

- **సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సందడిగా బయలుదేరిన బృందం...?**
- **మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సభకు పయనం...**



చిలప్‌చేడ్, నవంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేటలో ముఖ్యమంత్రి నిర్వహించిన భారీ బహిరంగ సభకు చిలప్ చేడ్ మం డల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మండలం లోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా బయలు దేరి సభకు హాజరయ్యేందుకు పయనమయ్యారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, ప్రజాప్రతినిధులు సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దుర్గా చలం, రాజేందర్‌రెడ్డి, ఆనంద్, యశోద, భిక్షపతి,గౌరీ, శ్రీధర్‌రెడ్డి,వీణ,ప్రవీణ్‌రెడ్డి, శేషాద్రి, రాములు పాల్గొన్నారు. అలాగే ఉపసర్పంచులు నరేష్, అఖిల్, కిష్టారెడ్డి, గోపాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విట్ట ల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తార, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విశ్వంబరస్వామి, భూమయ్య, కే.శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్, పర్శరాం రెడ్డి,రాఘవులు, శ్రీశైలం,ెండ్యా, గోపాల్, విఠల్, యాదగిరితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.

నర్సాపూర్ మార్కెట్ కమిటీలో మాలలకు అన్యాయం!

ఒక్క డైరెక్టర్ పదవి కూడా కేటాయించలేదని యువ నాయకుల ఆగ్రహం

నర్సాపూర్, నవంబర్ 19 (జనంసాక్షి): నర్సాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ నియామకంలో మాల సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై కాంగ్రెస్ పార్టీలో అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న మాల నాయకులకు నామినేటెడ్ పదవుల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆ వర్గానికి చెందిన యువ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుర్రాల మల్లేశం, వైస్ చైర్మన్‌గా పట్లూరి శ్రీనివాసరావును నియమించగా, డైరెక్టర్లలో మాల సామాజిక వర్గానికి ఒక్క పదవి కూడా కేటాయించలేదని కాంగ్రెస్ నాయకుడు దాడిగే నరేష్ ఆరోపించారు. ఒకే మండలంలో ఒక సామాజిక వర్గానికి చెం దిన పలువురికి పదవులు కల్పించినప్పుడు, పార్టీ కోసం పనిచేస్తున్న మాల నాయకులకు ఎందుకు అవకాశం ఇవ్వలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీలోని ఒక వ్యక్తికి ఒకే పదవి అనే సూత్రం ఏమైందని ఆయన నిలదీశారు. ఇప్పటికే మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న కొందరికి మార్కెట్ కమిటీలోనూ పదవులు కేటాయించడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు.

ఈ విషయంపై మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి స్పందించాలని కోరారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకుని అర్హత, అనుభవం ఉన్న మాల నాయకులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల గురించి చెప్పే కాంగ్రెస్ పార్టీ పదవుల పంపిణీలోనూ వాటిని పాటించాలని నరేష్ డిమాండ్ చేశారు. **మూలల ఓట్లు కావాలి కానీ పదవులు వద్దా?** అంటూ ప్రశ్నించారు.

పంట మార్పిడితో రైతులకు అధిక లాభాలు



కొల్చారం, నవంబర్ 19 (జనంసాక్షి): పొలం బడి కార్యక్రమంలో భాగంగా ఫీల్డ్ డే పోతిరెడ్డిపల్లి గ్రామం లో గ్రామ సర్పంచ్ లతా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా డిపిడి మాట్లాడుతూ రైతులకి రసాయన పురుగు మందులు పిచికారీ చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్త వివరించ డం, వరి కోయలు కాల్చడం వలన కలిగే నష్టాలు మరియు పంట మార్పిడి,పంటకోత ప్రయోగం ఎలా చేస్తారు, ప్రకృతి లో ఆహారం గొలుసు గురించి వివరించారు అలాగే ఏకలవ్య ఫౌండేషన్ చంద్ర శేఖర్ రైతులకి ఎఫ్ పి ఓ ప్రాముఖ్యత, తేన్నే టిగాల పేపకం గురించి అవగాహనా మరియు సబ్సిడీ గురించి వివరించారు ఏ డి ఏ కౌడిపల్లి పుణ్యవతి మాట్లాడుతూ వరి పంటలకి బదులుగా అరుతది పంటలు వేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమం లో కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి ,ఏకలవ్య ఫౌండేషన్ ఎన్ జి ఓ చంద్ర శేఖర్ , ఎంఏఓ, ఏఈఓ, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఎఫ్ పి ఓ ఛైర్మెన్ ప్రభాకర్ గౌడ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



బీజేపీ కార్మిక నేత నరేందర్ సాగర్‌కు ఘన సన్మానం



కృష్ణ, నవంబర్ 19 (జనంసాక్షి): బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన నరేందర్ సాగర్‌ను కృష్ణ మండ లం హిందూపూర్ గ్రామ యువత గురువారం శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను సత్కరించిన గ్రామ యువతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో
టేబుల్ టెన్నిస్ సౌకర్యాలకు రూ.7.91 లక్షలు మంజూరు

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చొరవతో 8 టేబుల్ టెన్నిస్ యూనిట్ల ఏర్పాటు



మెదక్ బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి):
మెదక్ నియోజకవర్గంలో క్రీడారంగ అభివృద్ధికి మరో ముంద డుగు పడింది. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ చొరవతో మెదక్ పట్టణంలోని పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో 8 టేబుల్ టెన్నిస్ యూనిట్ల కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం రూ.7,91,000 నిధులు మంజూరు చేసింది.
ఈ మేరకు రాష్ట్ర యువజనాభ్యుదయ, పర్యాటక, సాంస్కృతిక (క్రీడల) శాఖ జీవో ఆర్టీ నంబర్ 345, తేదీ 19-11-2026 ద్వారా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మంజూరైన నిధులతో స్టేడియంలో టేబుల్ టెన్నిస్‌కు అవసరమైన ఎనిమిది యూనిట్ల పరికరాలను కొనుగోలు చేయనున్నారు.
నియోజకవర్గ యువతకు మెరుగైన క్రీడా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేస్తున్న కృషిలో భాగంగా ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే మెదక్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల యువ క్రీడాకారులకు శిక్షణ పొందేందుకు మెరుగైన అవకాశం లభించనుంది.
క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువత తమ ప్రతిభను వెలికితీసేందుకు, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించేందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థను ఆదేశించారు.
యువత అభ్యున్నతి, క్రీడారంగ అభివృద్ధికి ఈ నిధుల మంజూరు దోహదపడనుంది.

పెద్ద శంకరంపేటలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

- పాల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పెద్ద శంకరంపేట, నవంబర్ 19 (జనంసాక్షి):
పెద్ద శంకరంపేటలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో షాకిర్ అలీ, ఆత్మ చైర్మన్ వినోద్ పాటిల్, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆమె దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

సీఎం సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



అమీన్పూర్, నవంబర్ 19 (జనంసాక్షి):
సిద్దిపేటలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభకు నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బస్సుల్లో కాంగ్రెస్ శ్రేణులు సిద్దిపేటకు తరలి వెళ్లారు.

21న మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష

చేర్యాల, నవంబర్ 19 (జనంసాక్షి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21న చేర్యాల బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్ తెలిపారు. పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు సకాలంలో హాజరయ్యేలా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.


నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన



నారాయణపేట, నవంబర్ 19 (జనంసాక్షి): ఎల్-నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో నారాయణపేట మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి విద్యార్థులతో నీటి సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించాలని, కుళాయిలు పూర్తిగా మూసివేయాలని, నీటి లీకేజీలను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బ్రష్, స్నానం, చేతులు కడుక్కోవడానికి అవసరమైనంత నీటినే వాడాలని, వర్షపు నీటిని సంరక్షించాలని తెలిపారు. ప్రతి కుటుంబం కనీసం 20 శాతం నీటి వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు 'సేవ్ వాటర్' ఆకృతిలో నిలబడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయభాను ప్రకాష్, మధుసూదన్, నరసింహులు, ప్రతాప్, శ్రీదేవి, మంగళ, విద్యార్థులు పాల్గొన్నారు.

హరిహరాదుల సన్నిధిలో అయ్యప్ప ఆలయం

బీరంగూడ గుట్టపై ఏడాది కాలంలో రూ.4 కోట్లతో నిర్మాణం.. నేటి నుంచి ప్రతిష్ఠ ఉత్సవాలు







అమీన్‌పూర్, నవంబర్ 19 (జనంసాక్షి): బీరంగూడ గుట్టపై హరిహరాదుల సన్నిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయం భక్తులకు అందుబాటులోకి రానుంది. గుట్టపై ఇప్పటికే పురాతన శివాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఉండగా, వాటి పక్కనే అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. దీంతో బీరంగూడ గుట్ట ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత ప్రసిద్ధి చెందనుంది. అమీన్పూర్ పరిసర ప్రాంతాల్లోని అయ్యప్ప భక్తుల కోరిక మేరకు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొల్లూరు మల్లేశం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో గత ఏడాది నవంబర్‌లో బీరంగూడ గుట్టపై ఎకరం స్థలంలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భక్తుల విరాళాలు, దాతల సహకారంతో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఏడాది కాలంలోనే ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు.
అయ్యప్ప ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచే 18 పవిత్ర మెట్ల కోసం వరంగల్ జిల్లా కాజీపేట నుంచి ప్రత్యేక ఏకశిలను తీసుకొచ్చి మెట్లను రూపొందించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నాగేంద్రుడు, మాళికాపురత్తమ్మ, సుబ్రహ్మణ్యస్వామి ఉప ఆలయాలను కూడా నిర్మించారు.
భక్తుల కోరిక మేరకే ఆలయ నిర్మాణం: ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ కొల్లూరు మల్లేశం మాట్లాడుతూ, ప్రతి ఏడాది తాను అయ్యప్ప మాల ధరిస్తానని, పలువురు భక్తులతో జరిగిన చర్చల అనంతరం ఆలయ నిర్మాణానికి సంకల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు, కమిటీ సభ్యుల సహకారంతో నిర్మాణం చేపట్టామని, భక్తుల నుంచి విరాళాలు సేకరించి పనులు పూర్తి చేసినట్లు వివరించారు.
నేటి నుంచి నాలుగు రోజులపాటు ఉత్సవాలు: నవంబర్ 20 నుంచి 23 వరకు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు. 20, 21 తేదీల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయి.
నవంబర్ 22న ఉదయం 9.49 గంటలకు అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తారు.
23న ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

బాలల రక్షణపై
మాట్లాడండి.. చెప్పండి.. కాపాడండి

- జడ్జి సాయి మనోజ్ కుమార్



నారాయణపేట, నవంబర్ 17 (జనంసాక్షి): 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా నాల్గవ రోజు గురువారం నారాయణపేట కృష్ణ గోకులం హైస్కూల్‌లో విద్యార్థులకు 'బోలో, బతావో, బచావో' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ కుమార్ మాట్లాడుతూ, ధైర్యంగా మాట్లాడటం బాలల రక్షణకు మొదటి మెట్టని అన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శను గుర్తించి, ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు తెలియజేయాలని సూచించారు. సఖి కేంద్రం చంద్రకళ మాట్లాడుతూ మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, బాలికలకు ధైర్యం, బాలురకు గౌరవభావం నేర్పించాలని అన్నారు. విద్యార్థులతో 'నేను భయపడను.. మాట్లాడతాను.. నా స్నేహితులను రక్షిస్తాను' అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యాశాఖ, చైల్డ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉపాధ్యాయులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి : PDSU జిల్లా అధ్యక్షుడు వెంకటేష్



ఆత్మకూర్, నవంబర్ 19 (జనంసాక్షి): ఇంటర్మీడియట్ బోర్డు రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని PDSU జిల్లా అధ్యక్షులు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆత్మకూర్‌లోని ప్రతిభ పారామెడికల్ కళాశాలలో PDSU ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్ బోర్డు రద్దు వల్ల విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని, విద్యారంగంలో మార్పులు చేసే ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. మనోజ్ కుమార్, అవినాష్, శివరామ్, చరణ్, తిరుమలేష్, శివ, అనిల్, అనుక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరుకొండలో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



ఊరుకొండ, నవంబర్ 19 (జనంసాక్షి):
మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయుబ్ పాషా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు ఇందిరాగాంధీ చేసిన కృషిని స్మరించుకున్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహదేవ్‌పల్లిలో భూభారతి భూ రీసర్వేపై గ్రామసభ

రైతులకు అవగాహన కల్పించిన సబ్ కలెక్టర్ ఉమా హారతి

కల్హేర్, నవంబర్ 19 (జనంసాక్షి): కల్హేర్ మండలం మహదేవ్ పల్లిలో భూభారతిలో భాగంగా భూ రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, ఎంఆర్ఓ శివ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి వెంకటేశ్ పాల్గొని భూ రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు.



భూముల సర్వే, హద్దుల నిర్ధారణ, భూ రికార్డుల్లో తప్పుల సవరణ తదితర అంశాలను అధికారులు రైతులకు వివరంగా వివరించారు. రీసర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు, భూ హక్కులకు కలిగే భద్రత గురించి తెలియజేశారు. అనంతరం రైతులు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. రీ సర్వే ప్రక్రియలో ప్రతి ఒక్క రైతు భాగస్వాములు కావాలని, తమ భూములకు సంబంధించిన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని సబ్ కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి పోచయ్య, గ్రామ పెద్దలు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం సభకు కల్హేర్ నుంచి కాంగ్రెస్ శ్రేణుల భారీ తరలింపు

కల్హేర్, నవంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేటలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కల్హేర్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కల్హేర్ కేంద్రానికి చేరుకున్న కార్యకర్తలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ జెండాలు పట్టుకుని, నినాదాలు చేస్తూ సిద్దిపేటకు బయలుదేరారు.





ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు రుణ మాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

ఊర్కొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ సంగ్రామ్ జి.పాటిల్

ఊర్కొండ, నవంబర్ 19 (జనంసాక్షి): ఊర్కొండ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సంగ్రామ్ జి.పాటిల్ వార్షిక తనిఖీలో భాగంగా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పోలీసుల పనితీరు, కేసుల పురోగతిని పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆస్తి నేరాల నియంత్రణకు నిఘా పెంచాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై దృష్టిసారించాలని సూచించారు. గ్రామాల్లో గస్తీ పెంచడంతో పాటు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు.



ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సాయి రెడ్డి వెంకట్ రెడ్డి, సీఐ భీమ్ కుమార్, ఎస్సై రమాదేవి, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత కుటుంబ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపణ

భూమిని తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు వినతి

తెలకపల్లి, నవంబర్ 19 (జనంసాక్షి): అప్పు వ్యవహారాన్ని ఆసరాగా చేసుకొని దళిత కుటుంబానికి చెందిన భూమిని మాయమాటలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బీఆర్ఎస్వీ నాయకుడు రెడ్డపాకుల శివశంకర్ ఆరోపించారు. మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన వడ్డేమాన్ కృష్ణయ్యకు జరిగిన అన్యాయంపై బాధిత కుటుంబంతో కలిసి గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

సర్వే నంబర్ 332లోని 1.27 గుంటల పట్టా భూమిని కృష్ణయ్య అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వంజ నారాయణరెడ్డి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని శివశంకర్ ఆరోపించారు. ఇటీవల ఆ భూమిని మరో



వ్యక్తి పేరుపై మార్చినట్లు తెలిపారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి భూమిని తిరిగి బాధిత కుటుంబానికి ఇప్పించాలని కోరారు. న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చిట్టిబాబు, జంగులు, శివ తదితరులు పాల్గొన్నారు.

కల్వకోల్‌లో పండగ సాయన్న విగ్రహాల ఏర్పాటుపై వివాదం

కాంగ్రెస్-బీజేపీ మధ్య పోటాపోటీ.. విగ్రహ ఏర్పాటును అడ్డుకున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి, నవంబర్ 19 (జనంసాక్షి):
మండలంలోని కల్వకోల్ గ్రామంలో పండగ సాయన్న జయంతి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుపై కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య వివాదం నెలకొని ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నెల 22న నిర్వహించనున్న జయంతి వేడుకల నేపథ్యంలో ఇరు పార్టీల నాయకులు పోటాపోటీగా విగ్రహాల ఏర్పాటుకు సిద్ధమయ్యారు.





కాంగ్రెస్ నాయకులు మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి పోటీగా బీజేపీ నాయకులు మరో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఒకే గ్రామంలో రెండు విగ్రహాల ఏర్పాటుపై వివాదం రాజుకుంది.





ఈ క్రమంలో బీజేపీ నాయకులు విగ్రహాన్ని దిమ్మెపై ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నాయకులు పోలీసుల చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ నాయకులను అడ్డుకోవడానికి కారణమేంటో పోలీసులు స్పష్టంగా చెప్పాలని బీజేపీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్ రావు డిమాండ్ చేశారు. ఈ పరిణామాలతో గ్రామంలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. జయంతి వేడుకల నాటికి వివాదం ఎలా పరిష్కారమవుతుందనే చర్చ స్థానికంగా సాగుతోంది.

విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, చారిత్రక అవగాహన పెంపొందించాలి

టేక్మాల్, నవంబర్ 19 (జనంసాక్షి):
మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలు, అందమైన చేతిరాతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేతిరాత నిపుణుడు ఎజాజ్ అహ్మద్ విద్యార్థులకు అందంగా, స్పష్టంగా రాసేందుకు పలు మెళకువలు వివరించారు. రిటైర్డ్ ఎస్ఐ సత్యనారాయణ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మేనేజర్ శ్రీయ రెడ్డి, కాకతీయుల చరిత్ర పరిశోధకులు బుర్ర సంతోష్ విద్యార్థులకు చారిత్రక విశేషాలను వివరించారు. వేల్పుగొండ తుంబులేశ్వర ఆలయం, ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయం, పోచారం డ్యామ్, మెదక్ చర్చి వంటి



పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను తెలియజేశారు.విద్యార్థులు తమ ప్రాంత చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి సాయిలు, సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్, సుభాష్, భాస్కర్, సిద్దయ్య, రమేష్, పాపయ్య, కిషోర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి చేసిన ఇందిరమ్మ

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్
- మహబూబ్‌నగర్‌లో ఇందిరాగాంధీ జయంతి

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 19 (జనంసాక్షి): దేశంలో పేదరిక నిర్మూలనకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ విశేష కృషి చేశారని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా అశోక్ టాకీస్ చౌరస్తాలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ బ్యాంకుల జాతీయీకరణతో సామాన్యులకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చారని, దేశాభివృద్ధికి ఎన్నో సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన ఆమె ఆశయాల సాధనకు ప్రతి



ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనూ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, డీసీసీ నాయకులు చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్ రెడ్డి, జహీర్ అఖ్తర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా తాగునీరు

గద్వాల, నవంబర్ 19 (జనంసాక్షి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ పక్కన పైపులైన్ నుంచి తాగునీరు నిరంతరాయంగా రోడ్డుపై పారుతూ వృథా అవుతోంది. కనెక్షన్ పైపుకు నల్లా లేకపోవడంతో నీరు బయటకు వస్తూ, కేబుల్ పనుల కోసం తవ్విన గుంతల్లో నిల్వ ఉండి ఆ ప్రాంతాన్ని బురదమయంగా మారుస్తోంది. దీంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, గర్భిణులు, వృద్ధులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారిపడి గాయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద, విషజ్వరాల ప్రమాదం పెరుగుతోందని



పేర్కొంటున్నారు. గత కొన్ని రోజులుగా సమస్య కొనసాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఒకవైపు తాగునీటి కొరత ఉండగా, మరోవైపు నీరు వృథా కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే పైపులైన్ మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టి, రోడ్డును బాగు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్‌తో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ

తాడూరు, నవంబర్ 19 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందించడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నూతన చేయూత సామాజిక భద్రత పింఛన్ల పథకంలో భాగంగా గురువారం తాడూరు మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.





ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నప్పటి నుంచి పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, అర్హులైన నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో చేయూత పింఛన్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం చేయూత నందిస్తోందన్నారు. రైతుల వ్యవసాయ ఖర్చులను తగ్గించి, సాగును మరింత సులభతరం చేసేందుకు స్ప్రింక్లర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి లబ్ధిదారులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ చైర్మన్ తీగల సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యార రమేష్, తాడూరు సర్పంచ్ సంద మల్లయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కొండ్ర మల్లేష్, కొండ నాగేష్, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పింఛన్ల లబ్ధిదారులు, పాల్గొన్నారు.



చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్ హామీలు అమలుచేయాలి



గద్వాల, నవంబర్ 19 (జనంసాక్షి): గద్వాల వాల్మీకి భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జోగులాంబ గద్వాల జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి లక్ష్మీపతి మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో దళితులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమిలేని దళితులకు మూడెకరాల భూమి, అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ పెండింగ్ సబ్సిడీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధికే ఖర్చు చేయాలని, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

నూతన కమిటీ ఎన్నిక: జిల్లా అధ్యక్షుడిగా ఆనోక్, ప్రధాన కార్యదర్శిగా నాగార్జున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, డీహెచ్‌పీఎస్, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



మిడ్జిల్, నవంబర్ 19 (జనంసాక్షి): మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమగ్రత కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సభకు తరలివెళ్లిన సంగారెడ్డి కాంగ్రెస్ శ్రేణులు



సంగారెడ్డి, నవంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేటలో గురువారం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల పరిధి నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ముందుగా సంగారెడ్డి ఐబీ చౌరస్తాకు చేరుకున్న నాయకులు, కార్యకర్తలు అక్కడి నుంచి బస్సుల్లో సిద్దిపేటకు బయలుదేరారు. సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితా సంతోష్, కాంగ్రెస్ నాయకులు జార్జ్, కిరణ్ గౌడ్, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



కృష్ణ, నవంబర్ 19 (జనంసాక్షి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను గురువారం కృష్ణ మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజప్ప గౌడ్, డీసీసీ కార్యదర్శి విజయ్ గౌడ్, ఉపాధ్యక్షులు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

• బీజేపీ మండల నాయకులు



ఖిల్లా ఘనపురం, నవంబర్ 19 (జనంసాక్షి): మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను గురువారం బీజేపీ మండల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనం, మౌలిక వసతుల గురించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను బోధించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని కోరారు.సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కొరిగెల గోపీ ముదిరాజ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు బెన్నూరి ఆశన్న, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి చిట్యాల రామచంద్రయ్య, జిల్లా నాయకులు శివశంకర్, వెంకటరమణ,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల పెన్షన్ నిబంధనలు సడలించాలి

• నిబంధనలు సడలించి చేనేత కార్మికులకు న్యాయం చేయాలి
• పద్మశాలి సేవా సంఘం యువత మండల అధ్యక్షులు గోవిందు వెంకటేశం



కోహెడ, నవంబర్ 19 (జనంసాక్షి): పద్మశాలి చేనేత కార్మికులకు పెన్షన్ విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని పద్మశాలి సేవా సంఘం యువత మండల అధ్యక్షుడు గోవిందు వెంకటేశం ఆరోపించారు. జీవితాంతం మగ్గంపై శ్రమిస్తూ అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న చేనేత కార్మికులకు వయోపరిమితితో సంబంధం లేకుండా తగిన పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న చేయూత పింఛన్ల లో భాగంగా 50 ఏళ్లు దాటిన చేనేత కార్మికులకు పెన్షన్ అందించేలా నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి కార్మికుడికి పెన్షన్ అందించాలని, స్థానిక కాంగ్రెస్ నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటం ఆవిష్కరణ



తెలకపల్లి, నవంబర్ 19 (జనంసాక్షి): మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖ కార్యాలయంలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ వైర్మన్ గంగాపురం రాజేందర్ గురువారం ఆవిష్కరించారు. రిటైర్డ్ గ్రంథాలయ అధికారిణి రాజ్యలక్ష్మి ఈ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే జ్ఞానం, విజ్ఞానం పెంపొందుతాయని, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ రంగానికి రంగనాథన్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. చిత్రపటాన్ని అందించిన రాజ్యలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము చంద్రశేఖర్, ఉపసర్పంచ్ వారణాసి శ్రీనివాసులు, ఎంఈఓ నరహరి, గ్రంథాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ

• అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పంపిణీ కార్యక్రమం



గోపాల్‌పేట, నవంబర్ :19 (జనంసాక్షి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చాకలిపల్లి గ్రామంలో సర్పంచ్ శశిరెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. 3 నుంచి 7 సంవత్సరాల పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శశిరెడ్డి మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన పోషకాహారం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వాతి, అంగన్‌వాడీ ఇన్‌చార్జి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే భూభారతి రీ సర్వే లక్ష్యం...

- తహసిల్దార్ భాస్కర్...



ఝరాసంగం, నవంబర్ 19(జనంసాక్షి): భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డులను ప్రక్షాళన చేసి, భూముల హద్దులను కచ్చితంగా నిర్ధారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి రీ-సర్వే కార్యక్రమాన్ని చేపడుతుందని తహసిల్దార్ భాస్కర్ అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని జునేగావ్ గ్రామపంచాయతీలోని ఆమ్లెట్ విలేజ్ అయిన ఇస్లాంపూర్ గ్రామంలో భూ భారతి రీ-సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల సమగ్ర రీ-సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రైతులందరూ భూభారతి రీ-సర్వేకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసిల్దార్ రాజు గౌడ్,జిపిఓ శ్రీశైలం రైతులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ జయంతి వేడుకలు.. ఘన నివాళులు





ఆత్మకూర్, నవంబర్ 19 (జనంసాక్షి): దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఆత్మకూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండీ రహమతుల్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి రాజేష్, వైస్ చైర్మన్ నల్లగొండ శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



అమరచింత, నవంబర్ 19 (జనంసాక్షి): నందిమల్ల ఎక్స్‌రోడ్డులో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీజీ టాడి టాపర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్ ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. దేశ సమగ్రత, పేదల సంక్షేమానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఇందిరమ్మ బీమా పథకం పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్‌లో ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



శ్రీరంగాపూర్, నవంబర్ 19 (జనంసాక్షి): మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమ్మరి గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రెడ్డి చర్ల శ్రీహరిరాజు, మండల అధ్యక్షుడు విష్ణు ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామచంద్రయ్య తదితరులు ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎయిడ్స్ నియంత్రణలో గద్వాల జిల్లా ప్రగతి అభినందనీయం

- సురక్షిత్ కేటగిరీలో రాష్ట్రంలోని 20 జిల్లాల్లో గద్వాలకు స్థానం



గద్వాల, నవంబర్ 19 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ కార్యక్రమాల అమలులో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రశంసించారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో గణనీయమైన ప్రగతి సాధించి జిల్లా సురక్షిత్ కేటగిరీలో గుర్తింపు పొందడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో గురువారం ఐడీఓసీలో నాకో డిప్యూటీ డైరెక్టర్ మేఖల, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కలెక్టర్‌ను కలిసి అభినందించి సన్మానించారు. నాకో ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మాన్ సమరోహ్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సురక్షిత్ కేటగిరీకి ఎంపికైన 20 జిల్లాల్లో గద్వాల చోటు సంపాదించడం గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, ఐసీటీసీ, ఏఆర్టీ, సీఎస్‌సీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత సిబ్బంది సమష్టి కృషి, సమన్వయంతో సాధ్యమైందని తెలిపారు. సాధించిన విజయంతో సంతృప్తి చెందకుండా హెచ్ఐవీ వ్యాప్తి నివారణ, విస్తృత పరీక్షలు, సకాలంలో చికిత్స, హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి నిరంతర వైద్య సేవలు అందించడంపై మరింత దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి, ప్రోగ్రాం అధికారి రాజు, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జేఏసీ నాయకుల అరెస్టులను ఖండిస్తున్నాం

చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటించాలి: వకులాభరణం నర్సయ్య





చేర్యాల, నవంబర్ 19 (జనంసాక్షి): చేర్యాల రెవెన్యూ డివిజన్ అఖిలపక్ష పోరాట సమితి జేఏసీ నాయకులను అరెస్టు చేయడాన్ని జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో గురువారం తెల్ల వారుజామున నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ప్రభుత్వం వెంటనే చేర్యాల రెవెన్యూ డివిజన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

గత పదేళ్లుగా కొనసాగుతున్న ఉద్యమానికి ప్రభుత్వం పరిష్కారం చూపాలని, అరెస్టు చేసిన జేఏసీ నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. సీఎంకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా: సర్పంచ్ మట్ట యాదమ్మ



వెల్దండ, నవంబర్ 19 (జనంసాక్షి): వెల్దండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఒకటో వార్డులో నూతన సీసీ రోడ్డు పనులను సింగిల్ విండో చైర్మన్ ఎన్నం భూపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హరికిషన్ నాయక్, ఉపసర్పంచ్ ఎర్ర శ్రీనుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని, గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, సింగిల్ విండో డైరెక్టర్ కొయ్యల పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేట మండల టిఆర్ఎస్ అధ్యక్షుడిగా సందుల రాజు



నారాయణపేట నవంబర్ 19(జనంసాక్షి): తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నారాయణపేట మండలం, బండగొండ గ్రామానికి చెందిన సందుల రాజును తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట మండల అధ్యక్షుడిగా నియమించడం జరిగిందనీ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్ తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ తరపున ఆయన నియామకాన్ని అధికారి కంగా అందజేశారు. సందుల రాజు పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, నారాయణపేట మండల పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సూచించారు. అలాగే మండలంలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారా నికి నిరంతరం కృషి చేయా లని కోరారు.

సివిల్ సప్లై కమిషనర్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్



కల్వకుర్తి, నవంబర్ 19 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కమిషన్ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో కమిషనర్ వై. నాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి కథనానికి స్పందన

- శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలు కూల్చివేత



రేవల్లి, నవంబర్ 19 (జనంసాక్షి): రేవల్లి మండలంలోని తల్పునూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువు కంటే ప్రాణాలకే ముప్పు ఎక్కువ అంటూ జనంసాక్షి దినపత్రికలో గత నెల 10వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తల్పునూర్ జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గురువారం కూల్చివేయడం జరిగింది. తల్పునూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని పాత భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, స్లాబ్, చజ్జాలు, స్తంభాలలో ఇనుప రాడ్లు బయటకు కనిపిస్తున్నాయని, పగుళ్లు, తేమతో నిర్మాణపరంగా బలహీనంగా మారి విద్యార్థుల ప్రాణాలకు ముప్పుగా మారాయని జనం సాక్షిలో కథనం ప్రచురితమైంది.

ఈ కథనానికి స్పందించిన రోడ్లు మరియు భవనాల శాఖ (ఆర్ & బి) అధికారులు భవనాన్ని తనిఖీ చేసి, శిథిలావస్థలో ఉందని, ఉపయోగానికి అనుకూలంగా లేదని నివేదిక ఇచ్చారు. అనంతరం విద్యార్థుల భద్రత దృష్ట్యా శిథిల భవనాలను కూల్చివేయాలని నిర్ణయించారు.

దీనిలో భాగంగా గురువారం జెసిబిల సహాయంతో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను కూల్చివేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. తమ పిల్లల ప్రాణాలకు ముప్పు తప్పిందని, కథనానికి స్పందించి చర్యలు తీసుకున్న అధికారులకు, జనం సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ శిథిల భవనాల స్థానంలో త్వరగా కొత్త భవనాలను నిర్మించి, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

జేపీనగర్ సమీపంలో ప్రమాదం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం







కల్వకుర్తి, నవంబర్ 19 (జనంసాక్షి): కల్వకుర్తి మండలం జేపీ నగర్ గ్రామ సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. బల్మూరు మండలం గట్టు తుమ్మెన గ్రామానికి చెందిన బత్తుల విష్ణుమూర్తి (46) అచ్చంపేట ఆర్టీసీ డిపోలో గత 13 ఏళ్లుగా డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు కండక్టర్ రమావత్ లలితతో కలిసి ఏపీ 29 జెడ్ 3412 నంబరు గల బస్సును ప్రయాణికులతో అచ్చంపేట నుంచి కల్వకుర్తికి తీసుకొచ్చారు.అనంతరం ఉదయం 11.30 గంటల సమయంలో తిరిగి ప్రయాణికులతో అచ్చంపేటకు బయలుదేరారు.ఈ క్రమంలో కల్వకుర్తిలోని సీబీఎం కళాశాల దాటిన తర్వాత జేపీనగర్ గ్రామ సమీపానికి చేరుకోగానే ఎదురుగా టీఎస్ 07 యూకే 5008 నంబరు గల కారు వేగంగా, అజాగ్రత్తగా వచ్చి బస్సు కుడివైపు డీజిల్ ట్యాంకు వద్ద బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు డీజిల్ ట్యాంకు నుంచి వెనుక టైరు వరకు ఉన్న భాగం దెబ్బతినడంతో పాటు సెంటర్ బోల్టు విరిగిపోయింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్, కండక్టర్‌తో పాటు ప్రయాణికులెవరూ గాయపడలేదు. ప్రమాదానికి కారణమైన కారు చారకొండ మండలం జూపల్లికి చెందిన జక్కుల శివ నడుపుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఇందిరమ్మ స్ఫూర్తితోనే ప్రజాపాలన



వెల్దండ, నవంబర్ 19 (జనంసాక్షి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను వెల్దండ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ ఎన్నం భూపతిరెడ్డి, సర్పంచ్ మట్ట యాదమ్మ, మట్ట వెంకటయ్య గౌడ్ ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగిస్తోందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన



గద్వాల నడిగడ్డ, నవంబర్ 19 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ వి. రాజేందర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక, సామాజిక అనర్థాలు కలుగుతాయని, విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. చెడు స్నేహాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100, బాలల రక్షణకు 1098, అత్యవసర సహాయానికి 112 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్ పాపన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడవేరుగు గ్రామంలో మొక్కజొన్న సాగుపై అవగాహన



చేర్యాల, నవంబర్ 19 (జనంసాక్షి): మండలంలోని కడవేరుగు గ్రామంలో భారత మొక్కజొన్న పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్, డాక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో రైతులకు మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పించారు. బహిరంగ మార్కెట్‌లో మొక్కజొన్నకు సుమారు రూ.3,000 ధర ఉండటంతో పాటు పౌల్ట్రీ, ఇంధన రంగాల్లో డిమాండ్ ఉందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో ఆరుతడి పంటగా మొక్కజొన్న సాగు చేయాలని సూచించారు. పంట మార్పిడితో రైతులు అధిక దిగుబడులు, లాభాలు పొందవచ్చన్నారు. సర్పంచ్ సమక్షంలో 25 మంది రైతులకు నాలుగు కిలోల విత్తన ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ అప్రోజ్, ఏఈఓ రజిత, సర్పంచ్ తాళ్లపల్లి రమేష్, రైతులు పాల్గొన్నారు.

సిద్దిపేట సభకు
సిర్గాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణుల తరలింపు



సిర్గాపూర్, నవంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం సభను విజయవంతం చేసేందుకు నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఐదు బస్సుల్లో తరలివెళ్లాయి. మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరారు. ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, మున్సిపల్ చైర్మన్ నాగేశ్ షెట్కార్ ఆధ్వర్యంలో ఈ తరలింపు జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ రావు, మండల ఇన్‌చార్జి యాదవ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వే, ఓటర్ల జాబితా సవరణ పక్కాగా చేపట్టాలి

- **అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ**



జడ్చర్ల, నవంబర్ 19 (జనంసాక్షి): జడ్చర్ల మండలంలో కొనసాగుతున్న భూ రీసర్వే, ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆదేశించారు. గురువారం శంకరాయపల్లి గ్రామసభలో ఆమె మాట్లాడుతూ జీపీఎస్ రోవర్ పరికరాలతో చేపట్టే రీసర్వే ద్వారా సరిహద్దు వివాదాలు పరిష్కారమవుతాయని, నిర్ణీత తేదీన పట్టాదారులు తమ భూముల వద్ద ఉండి రికార్డులు అందించాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఉండే



పట్టాదారులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 15 వరకు గడువు ఉందని, డిసెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. నవంబర్ 30లోగా ఏఎస్‌డీడీ (గైర్హాజరైన, తరలివెళ్లిన, మరణించిన, రెండు చోట్ల ఓట్లున్న) ఓటర్ల గుర్తింపు, ఫారాల పంపిణీ పూర్తి చేసి, ఫారం-6, 7, 8 దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగరావు, మున్సిపల్ కమిషనర్ గిరీష్, రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

- **12 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులు**





అమీన్‌పూర్, నవంబర్ 19 (జనంసాక్షి): అమీన్‌పూర్‌లో కిడ్నాప్‌కు గురైన రెండున్నరేళ్ల చిన్నారి అక్షిత కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శేర్లింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు.

ఘటన వివరాలు: నవంబర్ 18న మధ్యాహ్నం అమీన్‌పూర్‌కు చెందిన ఎరుకల సరిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను పని నిమిత్తం సమీపంలోని టిఫిన్ సెంటర్‌కు వెళ్లగా, మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో ఇంటి వద్ద ఉన్న తన రెండున్నరేళ్ల కుమార్తె అక్షిత కనిపించకుండా పోయిందని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు అమీన్‌పూర్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

5 ప్రత్యేక బృందాలతో గాలింపు...

కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చిన్నారి ఆచూకీ కోసం అమీన్‌పూర్, చందానగర్, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు ఎస్ఓటీ బృందాలతో కలిపి 25 మంది పోలీసులతో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

మెదక్‌లో నిందితురాలి అరెస్ట్...

సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేసిన పోలీసు బృందాలు, ఓ అనుమానాస్పద మహిళ చిన్నారిని ఇంటి వద్ద నుండి తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆ మహిళ మెదక్ ప్రాంతానికి చెందినదిగా నిర్ధారించుకున్న పోలీసులు, మెదక్ టౌన్ పోలీసుల సహాయంతో నర్సీఖేడ్ గ్రామంలో గాలింపు చేపట్టారు. అక్కడ పనిమనిషిగా పనిచేస్తున్న 44 ఏళ్ల గంగామణి అనే నిందితురాలిని అదుపులోకి తీసుకుని, ఆమె చెరలో ఉన్న చిన్నారి అక్షితను సురక్షితంగా రక్షించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

కమిషనర్ అభినందనలు...

స్థానిక పోలీసులు మరియు ఎస్ఓటీ బృందాల సమన్వయ కృషితో కేవలం 12 గంటల్లోనే చిన్నారిని క్షేమంగా తల్లి ఒడికి చేర్చినందుకు అమీన్‌పూర్, చందానగర్, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ల సిబ్బందిని మరియు ఎస్ఓటీ బృందాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ ప్రత్యేకంగా అభినందించారని డీసీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శేర్లింగంపల్లి ఏసిపి శ్రీనివాస రావు, అమీన్‌పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి ఉన్నారు.

బాలానగర్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం!

- రూ.1.50 కోట్లతో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన!



బాలానగర్, నవంబర్ 17 (జనంసాక్షి): బాలానగర్ మండల కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు మరో ముందడుగు పడింది. రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ.. బాలానగర్ మండల కేంద్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పనులను నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుమ్మళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాజేశ్వరి, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్గి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



నాగల్గిద్ద, నవంబర్ 19 (జనంసాక్షి): నాగల్గిద్ద మండలం ఎస్గి గ్రామంలో సర్పంచ్ జాదవ్ లక్ష్మణ్ అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులతో రేషన్ సేవలు సులభతరమవుతాయని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్19 (జనంసాక్షి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పకడ్బందీగా అమలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశించారు. గురువారం విసి హాల్లో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా జాతీయ కుటుంబ బీమా పథకం 18 నుండి 59 సంవత్సరాల వరకు కుటుంబంలో సభ్యులకు రేషన్ కార్డు ఆధారంగా నమోదు చేయాలన్నారు. దీని కొరకు వచ్చే దరఖాస్తులను తీసుకోవాలన్నారు. అలాగే ఈనెల 15 నుండి వచ్చేనెల 31 వరకు జరిగే త్రాగునీటి సరఫరా కార్యక్రమంలో పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఫ్రైడే డ్రైడేగ నిర్వహించాలని తెలిపారు. ఆయా గ్రామాలలో నూతనంగా మంజూరైన పెన్షన్లను పంపిణీ చేయడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను, జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్ లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్తను తగలబెట్టొద్దు: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

- డంపింగ్ యార్డును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- పొగతో రైతులు ఇబ్బంది పడకుండా తక్షణ చర్యలకు ఆదేశం



జడ్చర్ల, నవంబర్ 19 (జనంసాక్షి): మున్సిపాలిటీ పరిధిలోని జయప్రకాష్ నగర్ డంపింగ్ యార్డులో చెత్తను తగలబెట్టడం వల్ల వస్తున్న పొగ సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. పొగ కారణంగా సమీప రైతులు ఇబ్బందులు పడుతున్నారనే వార్తల నేపథ్యంలో గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ గిరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. యార్డులో వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్యం, పొగ రావడానికి గల కారణాలపై ఆరా తీసి, రైతుల ఇబ్బందులను పరిశీలించారు.

అనంతరం మాట్లాడుతూ.. యార్డులో ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్తను బహిరంగంగా తగలబెట్టరాదని స్పష్టం చేశారు. పొగ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని ఆదేశించారు.

యార్డును శుభ్రంగా ఉంచుతూ దుర్వాసన, పొగ, కాలుష్యం వ్యాపించకుండా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను హెచ్చరించారు.

అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు సహకరించాలి: అదనపు కలెక్టర్ సంగీత




సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీత కోరారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం పొడిగించిన గడువు ప్రకారం నవంబర్ 30 వరకు ఓటర్ల నమోదు పత్రాల పంపిణీ, సేకరణ కొనసాగుతుందని తెలిపారు. ఏఎస్‌డీడీ జాబితాలోని వివరాలను రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు పరిశీలించి, అర్హులైన ఓటర్లతో నమోదు పత్రాలు సమర్పించేలా చూడాలని సూచించారు.

నవంబర్ 30 వరకు దరఖాస్తులు స్వీకరించి, డిసెంబర్ 10 నాటికి పరిశీలన పూర్తి చేస్తామని వెల్లడించారు. డిసెంబర్ 15 వరకు అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారం చేపట్టి, డిసెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. పొరపాటున అర్హులైన ఓటర్ల పేర్లు తొలగితే నిర్దేశిత విధానంలో తిరిగి చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పురోగతిపై పార్టీలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కిసాన్ మోర్చా నిరంతరం కృషి చేయాలి

అచ్చంపేట నియోజకవర్గంలో కిసాన్ మోర్చా మండల కమిటీల నియామకం



ఉప్పునుంతల, (జనంసాక్షి): రైతుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నాయకులు క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేయాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు నారాయణ చంద్రారెడ్డి అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల కిసాన్ మోర్చా కమిటీల నియామక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడంతో పాటు రైతులకు అందాల్సిన హక్కులు, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు.



రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ తరఫున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన మండల కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి, రైతుల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఉప్పునుంతల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఏళ్ల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి, ఉప్పునుంతల మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గొడుగు శంకర్ యాదవ్‌ను నియమించారు. అదేవిధంగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో అచ్చంపేట రూరల్, బల్మూర్, లింగాల మండలాల కిసాన్ మోర్చా కమిటీలను పూర్తిస్థాయిలో నియమించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ముక్తాల రేణుక, జిల్లా కౌన్సిల్ సభ్యుడు వావిలాల రమేష్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదనాగుల మహేందర్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్ చౌహాన్, ఉప్పునుంతల మండల అధ్యక్షుడు తోల మహేష్ యాదవ్, అచ్చంపేట రూరల్ మండల అధ్యక్షురాలు కాట్రావత్ జ్యోతి, ప్రధాన కార్యదర్శి పటపార్ల రమేష్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు బయ్య రాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అఖిల్ రెడ్డి, రాకేష్ వర్మ, దేవేందర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బండ్లబాట నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు



వీపనగండ్ల, నవంబర్ 20 (జనంసాక్షి): మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామ రైతుల సౌకర్యార్థం బండ్లబాట నిర్మాణానికి మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.5 లక్షల నిధులు మంజూరు చేయించారు. గ్రామ పరిధిలోని పీడబ్ల్యూడీ రహదారి నుంచి వీపనగండ్లకు వెళ్లే మార్గంలో నిర్మించనున్న బండ్లబాట పనులను కాంగ్రెస్ నాయకుడు నాగర్ల రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి పూర్తయితే రైతులు పంటలను పొలాల నుంచి గ్రామానికి, మార్కెట్లకు తరలించేందుకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం, విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల గోపాల్, మాజీ ఉపసర్పంచ్ బిజ్జ నరేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరికి కౌన్సిలర్ దంపతుల కృతజ్ఞతలు



మక్తల్, నవంబర్ 19 (జనంసాక్షి): మక్తల్ మున్సిపాలిటీ 7వ వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కౌన్సిలర్ కలాల్ శ్రీవిద్య, నీలగౌడ్ దంపతులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వార్డులో ప్రధాన రహదారి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించడంతో పాటు, అయ్యప్ప స్వామి ఆలయ షెడ్డు నిర్మాణానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించి మిగిలిన అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో కౌన్సిలర్ దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

సిద్దిపేటకు ఏం చేశారో సీఎం సమాధానం చెప్పాలి

- బీఆర్ఎస్వీ నాయకుల డిమాండ్



నంగునూరు (జనంసాక్షి): సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన సందర్భంగా బీఆర్ఎస్వీ నంగునూరు మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించడంపై విద్యార్థి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఔటర్ రింగ్ రోడ్డు, అగ్రికల్చర్ కాలేజీ, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం, టూ టౌన్ పోలీస్‌స్టేషన్ వంటి అభివృద్ధి పనులు ఎందుకు నిలిచిపోయాయో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 45 రోజుల్లో అమలు చేస్తామన్న రైతు భరోసా హామీపై కూడా బహిరంగ సభలో లెక్క చెప్పాలని కోరారు. అరెస్టయిన వారిలో తప్పేట పర్షరాములు, భూక్యా భిక్షపతి నాయక్, దాసరి రమేష్ తదితరులు ఉన్నారు.

గద్వాల ప్రాంత సమగ్ర అభివృద్ధే నా ధ్యేయం: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

- గట్టు మండలంలో 942 మందికి నూతన చేయూత పింఛన్ల పంపిణీ
- నిరుపేదలకు అండగా ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలు

గద్వాల, నవంబర్ 19 (జనంసాక్షి): గద్వాల ప్రాంత సమగ్ర అభివృద్ధి, నిరుపేద కుటుంబాల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా బుధవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండలానికి చెందిన 942 మంది అర్హులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత, చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ పథకాలు అమలు చేస్తోందన్నారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు పక్కా గృహాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా...

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రారంభించిన ఇందిరమ్మ బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో ఒకరు లేదా ఇద్దరిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గానికి 5 వేలకు పైగా నూతన పింఛన్లు మంజూరు చేసిన సీఎం, మంత్రులు, ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

గట్టు మండలం గతంలో వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, ప్రస్తుతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు విద్యారంగంలో అక్షరాస్యత పెరిగిందన్నారు. ఎల్-నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమైనప్పటికీ ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించామని తెలిపారు. మహిళలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు.



కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చేయూత పింఛన్ పత్రాల పంపిణీ

మల్దకల్, నవంబర్ 19 (జనంసాక్షి): మండల పరిధిలోని అమరవాయి గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలనుఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా అమరవాయి గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అమరవాయి గ్రామానికి చెందిన మొత్తం 53మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం అభినందనీయం,గ్రామ ప్రజల సమస్యలను గుర్తిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సర్పంచ్ కి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పేద,బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి చేయూత పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేయాలని అన్నారు.ఈ ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ రంగన్న, మహేష్,డీలర్ తిమ్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం



కేటీదొడ్డి, నవంబర్ 19 (జనంసాక్షి): కేటీదొడ్డి మండల కేంద్రానికి చెందిన రైస్ మిల్ పాండు గద్వాలలోని తన స్వగృహంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో కేటీదొడ్డి మండల అధ్యక్షులు ఉరుకుందు యుగంధర్ గౌడ్, రవిబాబు, జంగిలప్ప, వీరేష్, అంజి తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులు భజనలు, కీర్తనలు ఆలపించడంతో ఆ ప్రాంతమంతా స్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎల్‌నీవో ప్రభావం పై రైతులకు అవగాహన



చిన్నశంకరంపేట, నవంబర్ 19(జనంసాక్షి):
ఎల్ నీవో ప్రభావంతో రైతులు పండే పంటలను వేయాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ అన్నారు. చిన్నశంకరంపేట మండలం వెంకట్రావు పల్లి గ్రామ పంచాయతీ లో గురువారం సర్పంచ్ మల్లేష్ యాదవ్ అధ్యక్షతన ఎల్లినోపై గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ , మండల ఆఫీసర్ సింధు, వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్, ఆర్టికల్చర్ అధికారి మహేశ్వరి, అలాగే వివిధ శాఖల అధికారులు గ్రామ ప్రజలు ముఖ్యంగా రైతులు గ్రామసభలో పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామంలో నీటి సంరక్షణ గురించి గ్రామ ప్రజలకు నీటి పొదుపు పై ప్రతిజ్ఞ చేయించి నీటి యొక్క ఆవశ్యకతను తెలియజేయడం జరిగింది. రైతులు పొలాలలో పండే పంటలను అరుతడి పంటలు వేసుకోవాలని తెలిపారు. నీటిని వృధా చేయరాదని తెలిపారు.

హెచ్ఐవీ నియంత్రణలో మహబూబ్‌నగర్‌కు 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు

రాష్ట్రంలోని 20 సురక్షిత్ జిల్లాల్లో స్థానం సాధించిన ప్రగతిని కొనసాగిస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో 95-95-95 లక్ష్యాల సాధనకు చేసిన కృషికి మహబూబ్‌నగర్ జిల్లాకు 'సురక్షిత్ జిల్లా' గుర్తింపు లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ గుర్తింపు పొందిన 20 జిల్లాల్లో మహబూబ్‌నగర్‌కు స్థానం దక్కడం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది సమష్టి కృషికి నిదర్శనమని కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. టీజీసాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విద్యాసాగర్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'సమ్మాన్ సమారోహ్' కార్యక్రమంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లను టీజీసాక్స్ డిప్యూటీ డైరెక్టర్ మేఖల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు గుర్తింపు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. సాధించిన ప్రగతిని కొనసాగిస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రజల్లో హెచ్ఐవీపై అవగాహన పెంచడం, పరీక్షల సంఖ్యను విస్తరించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందించడం, మధ్యలో చికిత్స నిలిపివేసిన వారిని తిరిగి వైద్య సేవల పరిధిలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి వ్యాధి నిర్ధారణ, నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) చికిత్స, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ లోడ్ నియంత్రణలోకి తీసుకురావడం 95-95-95 లక్ష్యాలని అధికారులు వివరించారు. ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా అందించడం, వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించడం, చికిత్స కొనసాగింపుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ సూచించారు. డీపీఎంసీయూ ఆధ్వర్యంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శశికాంత్, డాక్టర్ రాజు నాయక్, డీఏపీసీయూ బృందం సభ్యులు, వైద్య సిబ్బంది, టీఐ-ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం

- అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు
- అఖిలపక్ష నాయకుల హెచ్చరిక



బెజ్జంకి, నవంబర్ 19 (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట జిల్లా కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో నిరసన తెలిపే అవకాశం ఉందనే కారణంతో బెజ్జంకి మండలానికి చెందిన అఖిలపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు.అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని,ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ బెజ్జంకి మండలంలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని ఇప్పటివరకు పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడం విచారకరమన్నారు.ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజల పక్షాన ప్రభుత్వం పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ, డీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డుపై ప్రమాదకరంగా కంకర..

- అదుపుతప్పి స్కిడ్ అయిన కారు! • తృటిలో తప్పిన ప్రమాదం..
- రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్!

బాలానగర్, నవంబర్ 19(జనంసాక్షి):
జడ్చర్ల మండలంలోని కోడ్గల్-బాలానగర్ తిరుమలగిరి గ్రామాల మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులు వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై కంకర వేసి వదిలేయడంతో నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



గురువారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో గంగాపూర్ నుంచి బాలానగర్ వైపు గృహప్రవేశ కార్యక్రమానికి స్విఫ్ట్ కారులో వెళ్తున్న ఓ వ్యక్తి ఈ మార్గంలో ప్రయాణిస్తుండగా, రోడ్డుపై ఉన్న కంకర కారణంగా కారు అదుపుతప్పి స్కిడ్ అయింది. దీంతో కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అయితే అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, కార్లలో ప్రయాణించేవారు ఏ క్షణంలో ప్రమాదానికి గురవుతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రహదారిపై ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులను వెంటనే పునఃప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మరో ప్రమాదం జరగకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తుక్కాపూర్ గ్రామ రైతుల సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే చొరవ

- వేదికపైనే హామీ కాదు.. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి లేఖ రాయడంపై రైతుల హర్షం.. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు
- గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు



కొల్చారం, నవంబర్ 19 (జనంసాక్షి): కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామ రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారానికి మంజీరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మించాలని చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి తక్షణమే స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బుధవారం తుక్కాపూర్ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డికి గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు సభా వేదికపై గ్రామ రైతాంగం తరఫున మంజీరా నదిపై చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని సానుకూలంగా తీసుకున్న ఎమ్మెల్యే వెంటనే రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాయడం పట్ల గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రైతుల సాగునీటి అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డికి తుక్కాపూర్ గ్రామ రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో గద్వాల జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

విద్యార్థుల అభ్యసన స్థాయిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 19 (జనంసాక్షి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జోగులాంబ గద్వాల జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తూ వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎస్ఏ-1 పరీక్షల ఫలితాలు, 'స్ఫూర్తి' ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్ అమలుపై విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పాఠశాలలు, సబ్జెక్టుల వారీగా ఫలితాలు, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను ఏ,బి,సి,డి కేటగిరీలుగా విభజించి వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. డిసెంబర్ 20లోగా సిలబస్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

విద్యార్థుల ఫలితాలు, అభ్యసన స్థాయిలకు సంబంధించిన సమాచారాన్ని సక్రమంగా రూపొందించని ప్రధానోపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాఠశాల ఫలితాలకు బాధ్యత వహించాలని, ఉపాధ్యాయుల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, సాకులు చెప్పే ధోరణిని సహించబోమని హెచ్చరించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రతిభావంతులను మరింత ప్రోత్సహించాలని తెలిపారు. పాఠ్య ప్రశ్నపత్రాలతో సాధన చేయించడం, స్లిప్ టెస్టులు నిర్వహించడం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయాలన్నారు. విద్యార్థుల గైర్హాజరుపై ప్రత్యేక నిఘా ఉంచి, వరుసగా పాఠశాలకు రాని వారి తల్లిదండ్రులను సంప్రదించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు.





ప్రతి నెలా విద్యార్థుల ప్రగతి, హాజరు, ప్రత్యేక తరగతుల నిర్వహణపై సమీక్షిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సమావేశంలో డీఈఓ విజయలక్ష్మి, మండల విద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్-2026 గడువు పొడిగింపు.. నవంబర్ 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమం షెడ్యూల్‌ను సవరించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు మరింత అవకాశం కల్పించేందుకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ గడువును నవంబర్ 18 నుంచి నవంబర్ 30 వరకు పొడిగించినట్లు వెల్లడించారు.

అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, తొలగింపులు, సవరణలు, చిరునామా మార్పులకు సంబంధించిన దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న అనామలీస్, నో మ్యాపింగ్ ఓటర్లు తప్పనిసరిగా తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు.

సవరించిన షెడ్యూల్ వివరాలు...

- క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ: నవంబర్ 18 నుంచి 30 వరకు.
- నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం: ఆగస్టు 17 నుంచి డిసెంబర్ 15 వరకు.
- తుది ఓటరు జాబితా ప్రచురణ: డిసెంబర్ 22.

జిల్లాలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు సవరించిన షెడ్యూల్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఎస్ఐఆర్-2026 కార్యక్రమ పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విదేశాల్లో దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న రాహుల్ గాంధీ, సీఎం రేవంత్

- ప్రజాక్షేత్రంలో పోరాడాలి.. విదేశాల్లో విమర్శిస్తే ప్రధాని కాలేరు?
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకట రాములు



మక్తల్, నవంబర్ 19 (జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని బీజేపీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట రాములు ముదిరాజ్ విమర్శించారు. గురువారం మక్తల్ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విదేశాలకు వెళ్లి భారతదేశాన్ని, ప్రధాని మోదీని విమర్శించడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో పోరాడి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, విదేశాల్లో విమర్శలు చేసినంత మాత్రాన ప్రధాని కాలేరని అన్నారు.

ప్రపంచ దేశాలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని, భారతదేశ అభివృద్ధిని గుర్తిస్తున్నాయని పేర్కొన్నారు. 2014 నుంచి మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో రైల్వే, రక్షణ రంగాల్లో దేశీయ ఉత్పత్తులు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో దేశం కుంభకోణాలతో అభివృద్ధిలో వెనుక బడిందని విమర్శించారు. ప్రజల మద్దతుతోనే అధికారం లభిస్తుందని, వంశపారంపర్యంగా పదవులు రావని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని, అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగలేదని వారు పేర్కొన్నారు. ఓటు చోరీపై రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలను ఖండించారు. బీజేపీ, ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజల మద్దతు తగ్గదని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్ణి స్వామి, జిల్లా కార్యదర్శి కనకరాజు, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జావేద్ హుస్సేన్, ఓబీసీ నాయకుడు ఆడం సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రస్మ నాగర్‌కర్నూల్

జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


- అధ్యక్షుడిగా చిదిరే నరేష్.. ప్రధాన కార్యదర్శిగా రాజు యాదవ్



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మ) నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగర్‌కర్నూల్ శాంతినికేతన్ పాఠశాల కరస్పాండెంట్ చిదిరే నరేష్, ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేటకు చెందిన రాజు యాదవ్, కోశాధికారిగా కొల్లాపూర్‌కు చెందిన శివ కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ట్రస్మ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మధుసూదన్, ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారం, విద్యారంగ అభివృద్ధి, యాజమాన్యాల మధ్య సమన్వయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ మండలాల పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపదలో పేద కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా

- బాధితురాలికి రూ.45 వేల చెక్కు అందజేత



పెద్దకొత్తపల్లి, నవంబర్ 19 (జనంసాక్షి): ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్య మంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని మాజీ జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్ అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వేదుకరావుపల్లి తండాకు చెందిన మెగావత్ రుక్మిణికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.45 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం మారేడుమాన్‌దిన్నెలో అందజేశారు. రుక్మిణి వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేటి మోహన్, మాజీ సర్పంచ్ అరవింద్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెలిగిరిపేటలో చేయూత పింఛన్ పత్రాల పంపిణీ



సదాశివపేట, నవంబర్ 19 (జనంసాక్షి): సదాశివపేట మండలం మెలిగిరిపేట గ్రామంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ పత్రాలను సర్పంచ్ షాబుద్దీన్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలానగర్ మండలంలో 658 మందికి చేయూత పింఛన్లు

37 గ్రామ పంచాయతీల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ







బాలానగర్, నవంబర్ 19 (జనంసాక్షి): బాలానగర్ మండలంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పింఛన్ల పత్రాల పంపిణీ కార్యక్రమం మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు చెందిన 658 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఎన్నాళ్లుగానో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి మంజూరు పత్రాలు అందడంతో హర్షం వ్యక్తమైంది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అర్హులకు కొత్త పింఛన్లు మంజూరు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నాలుగున్నరేళ్లు మంత్రిగా పనిచేసినా నియోజకవర్గానికి అవసరమైన నిధులు తీసుకురావడం, అభివృద్ధి పనులు చేపట్టడంపై తగిన శ్రద్ధ చూపలేదని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని విస్మరించి రియల్ ఎస్టేట్ వ్యాపారానికే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి హెచ్ఎండీఏ నిధులు తీసుకొచ్చి పలు కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. పెద్దాయపల్లి గ్రామంలో ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా, నవోదయ పాఠశాల మంజూరుకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. బాలానగర్–గంగాపూర్ రహదారి మంజూరైందంటూ 2024 ఎన్నికలకు ముందు గత పాలకులు ప్రజలకు హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు.

ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, 37 గ్రామ పంచాయతీలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సహజ ప్రసవాన్ని ప్రోత్సహిద్దాం..

సిజేరియన్ ప్రసవాలపై అవగాహనకు ఈ నెల 22న వాక్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): సహజ ప్రసవం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 22న సంగారెడ్డిలో అవగాహన వాక్ నిర్వహించనున్నట్లు సమన్వయకర్త ప్రొఫెసర్ విజయకుమారి తెలిపారు. సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఈ వాక్ చేపడుతోందన్నారు. ఈ నెల 22న ఉదయం 6 గంటలకు జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రారంభమయ్యే వాక్ ఐబీ జంక్షన్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో మిడ్‌వైవ్స్, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్య నిపుణులు పాల్గొంటారని వెల్లడించారు. సహజ ప్రసవ ప్రయోజనాలు, వైద్యపరంగా తప్పనిసరి అయినప్పుడు మాత్రమే సిజేరియన్ చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు రంగోలి పోటీలు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19(జనంసాక్షి): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం విద్యార్థినీ విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత హాజరయ్యారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య, కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గ్రంథపాలకురాలు లలితాబాయి పర్యవేక్షించారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



వనపర్తి, నవంబర్ 19 (జనంసాక్షి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందిరా పార్కులోని ఆమె విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమైక్యత, అభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేట సీఎం సభకు

భారీగా తరలివెళ్లిన చేర్యాల ప్రజలు



చేర్యాల, నవంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభకు చేర్యాల మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భారీగా తరలి వెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వాహనాల్లో సిద్దిపేటకు బయలుదేరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించనున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. సభను విజయవంతం చేసేందుకు చేర్యాల పట్టణం, గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముందుండి ప్రజలను సమీకరించారు.

సిద్దిపేట సభకు భారీగా తరలిన బెజ్జంకి కాంగ్రెస్ శ్రేణులు



బెజ్జంకి,నవంబర్ 19,(జనంసాక్షి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న బహిరంగ సభకు బెజ్జంకి మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, బయలుదేరారు.కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు మద్దతుగా నాయకులు,కార్యకర్తలు ఉత్సాహంగా సభలో పాల్గొన్నారు.

లింగసన్‌పల్లి తండాలో మ్యాజిక్ ఇంకుడు గుంతల నిర్మాణం

పారిశుధ్య మెరుగుదల, మురుగునీటి నివారణే లక్ష్యం: అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి, మురుగునీటి నిల్వను నివారించేందుకు హవేలీ ఘన్‌పూర్ మండలం లింగసన్‌పల్లి తండా గ్రామపంచాయతీలో సామూహిక మ్యాజిక్ ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా మురుగునీటి నిల్వను అరికట్టవచ్చన్నారు. దోమల వ్యాప్తి తగ్గడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణకు, భూగర్భ జలాల పెంపునకు ఇవి దోహదపడతాయని తెలిపారు. గ్రామస్తులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం అధికారులతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు, డీపీఓ యాదయ్య, సర్పంచ్ కే. శాంతాబాబు, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాస్తవ విస్తీర్ణానికే

పట్టా: సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్



హత్నూర, నవంబర్ 19 (జనంసాక్షి) రికార్డులకు అనుగుణంగా ఆ పరిమితిలో ఉన్న భూములకే పట్టాలు ఇవ్వడం జరుగుతుందని సంగారెడ్డి జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారి రాజేందర్ అన్నారు. మండలంలోని సాదుల్ నగర్ గ్రామంలో గురువారం భూముల రీ సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు.పట్టా పాసు పుస్తకాల్లో నమోదు చేసిన భూమికి అదనంగా ఉన్నట్టు భూ రీ సర్వేలో తేలితే దానిని భూమి లేని నిరుపేదలకు కేటాయించడం జరుగుతుందని వారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్వీన్ షేక్, డిప్యూటీ ఐఓఎస్ రాజు,ఉప తహసీల్దార్ దావూద్, సర్పంచి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



నర్సాపూర్, నవంబర్ 19 (జనంసాక్షి): నర్సాపూర్‌లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధి, సమగ్రత, పేదల సంక్షేమానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజు యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

- **ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే: ఖమ్మం వెంకటేశం**



కోహెడ, నవంబర్ 19 (జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో కోహెడ మండల బీజేపీ నాయకులను తెల్లవారుజామునే పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం ఖండించారు. ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు లేదా, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం నేరమా అని ప్రశ్నించారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న ప్రజాపాలన అంటూ విమర్శించారు. ప్రతిపక్ష గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.

అరెస్టయిన వారిలో వెంకటేశం, మండల ప్రధాన కార్యదర్శి పేర్యాల సాగర్ రావు, గుగ్గిళ్ల శ్రీనివాస్, కంది సత్యనారాయణ రెడ్డి, కక్కెర్ల దామోదర్ గౌడ్ ఉన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం ఆగదని వెంకటేశం స్పష్టం చేశారు.

టీపీటీఎఫ్ కోహీర్ మండల నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- అధ్యక్షుడిగా డాక్టర్ కె.వసంత్ రాజ్, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్





కోహీర్, నవంబర్ 19 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జెడ్పీహెచ్ఎస్ దిగ్వాల్‌కు చెందిన డాక్టర్ కె.వసంత్ రాజ్, ప్రధాన కార్యదర్శిగా ఎంపీపీ బిలాల్‌పూర్‌కు చెందిన కె. సురేష్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎన్. రాకేష్, కె. భార్గవి, ఎస్. అశోక్ కుమార్, ఏ. రాంచందర్ ఎంపికయ్యారు.

సమావేశంలో పలు తీర్మానాలు...

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్సీ వెంటనే అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తీర్మానించారు. జీవో 25 సవరించి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని, ప్రతి పాఠశాలకు హెచ్ఎంను నియమించాలని కోరారు. స్కావెంజర్ల వేతనాలు విడుదల చేయడంతో పాటు ప్రీప్రైమరీ పాఠశాలలకు ఉపాధ్యాయులు, ఆయాలను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని నూతన కమిటీ నిర్ణయించింది.

ఛలో సిద్దిపేటకు
బయలుదేరిన వింజపల్లి కాంగ్రెస్ శ్రేణులు



కోహెడ, నవంబర్ 19 (జనంసాక్షి): సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభకు కోహెడ మండలం వింజపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శెట్టి సుధాకర్ పిలుపుతో గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఉత్సాహంగా బయలుదేరారు. కార్యక్రమంలో వింజపల్లి సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బద్దం రాజిరెడ్డి, ఉపసర్పంచ్ రంగనవేని వెంకటస్వామి, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష

- రూ.20 వేల జరిమానా విధించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు



మెదక్ బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 17 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వడ్డ సురేష్‌కు ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు సురేష్ బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. 2022 మార్చి 12న పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను హైదరాబాద్‌కు రావాలని కోరాడు. దీంతో బాలిక ఒంటరిగా అద్దె ఆటోలో ప్రయాణిస్తుండగా అనుమానం వచ్చిన డ్రైవర్ ఆమెను జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పోలీసులు బాలికను ఇంటికి చేర్చారు. నిందితుడు పెళ్లికి నిరాకరించడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు 2022 మార్చి 23న శంకరంపేట-ఎ పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పటి దర్యాప్తు అధికారి సీఐ జార్జ్ సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో సమర్పించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావళి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసులో సమర్థవంతంగా పనిచేసిన సీఐ జార్జ్, పీపీ బాలయ్య, శంకరంపేట ఎస్సై ప్రవీణ్ రెడ్డి, కోర్టు లైజన్ అధికారులు ఎస్సై విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ విటోబాలను ఎస్పీ అభినందించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ఏర్పాట్లు

ఈ నెల 20 నుంచి గ్రామాలు, వార్డుల్లో ప్రత్యేక నమోదు శిబిరాలు: కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు పటిష్ట మైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 20 నుంచి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అర్హులైన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆహార భద్రత కార్డులు కలిగిన అర్హుల వివరాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యులు, నామినీలు, వయస్సు, బంధుత్వ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియపై ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు.

బీమా చేయించుకునే వ్యక్తి స్వయంగా శిబిరానికి హాజరై వివరాలు అందించాలని, నామినీలు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నమోదు చేసిన వివరాలకు అనుగుణంగా ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించి భద్రపరచాలన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు శిబిరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీపీఓ మల్లారెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాహారతి, సీపీఓ గీత, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లతో అధికారుల చర్చలు విఫలం

ధాన్యం సేకరణకు ముందుకు రాని మిల్లర్లు
గోదాములేక సుదూర ప్రాంతాలకు ధాన్యం తరలింపు
లారీల కొరతతో కల్లాల్లో మూలుగుతున్న వరి ధాన్యం

హుస్నూర, నవంబర్ 19 (జనంసాక్షి):

సాగు అంటేనే సమస్యలతో సావాసం చేయడం, అతివృష్టి, అనావృష్టి, అకాల వర్షాలు, విద్యుత్ కోతలు, ఎరువుల కొరతలు, చీడపీడలు ఇవన్నీ పంట సాగుపై ముప్పేట దాడి చేస్తూనే ఉంటాయి.అయినా మట్టిపై మమకారం పెంచుకున్న రైతులు వాటన్నింటినీ తట్టుకుని సాగుకు సమాయత్తమవుతున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా,ఎంత నష్ట మొచ్చినా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగుతున్నారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులు కొత్త సమస్యతో సతమతమవుతున్నారు. తాము పండించిన పంట నూర్పి ధాన్యం కల్లాలకు చేరినప్పటికీ కొనుగోళ్ల ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ధాన్యం సేకరణ కేటాయింపు విషయంలో రైసుమిల్లర్లకు అధికారులకు మధ్య జరిగిన చర్చలు ఫలించకపోవడం పరిస్థితిని మరింత జటిలం చేస్తుంది.కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ సజావుగా సాగాల్సి ఉండగా మిల్లుల కేటాయింపులు,ధాన్యం తరలింపు విషయంలో ఎదురవుతున్న సమస్యలు రైతులకు భారంగా మారుతున్నాయి.మండల వ్యాప్తంగా ఐకెపి,పాక్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వం సుమారు 40 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోయినప్పటికీ దానికి ముందే రైతులు తమ వరి



ధాన్యాన్ని కేంద్రాల వద్దకు చేర్చారు.నిన్నటి దాకా కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం కాగా,నేడు ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతుండటం రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తీసుకోకపోవడం,నిల్వ చేసేందుకు సరిపడా గోదాములు స్థానింకంగా లేకపోవడం అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. దీంతో సేకరించిన ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అయినప్పటికి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. సేకరించిన ధాన్యాన్ని జహీరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు తరలించే క్రమంలో రవాణా సమస్య ఎదురవుతుంది. ధాన్యం లోడుతో వెళ్ళిన లారీలు ఎప్పటికీ చేరుకుంటాయో,ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.లారీల రాక కోసం రైతులు రాత్రింబవళ్లు కల్లాల్లో ఎదురు చూస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి ధాన్యం తరలింపులో వేగం పెంచాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాయుద్ధనౌక గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన డాక్టర్ వెన్నెల గద్దర్

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ గద్దర్ ఆశయాలు, ప్రజా ఉద్యమాల్లో ఆయన చేసిన పోరాటాలు, పాటల ద్వారా ప్రజల్లో కలిగించిన చైతన్యం చిరస్మరణీయమని అన్నారు. నాన్న ఆశయం స్ఫూర్తితోనే పేద ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరగకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

అణగారిన వర్గాల హక్కుల కోసం గద్దర్ తన జీవితాంతం పోరాడారని, తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తు చేశారు. గద్దర్ ఆశయాలను కొనసాగిస్తూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు.ఈ సందర్భంగా ప్రజా ఉద్యమ నాయకుడు ఎత్తం కృష్ణయ్య అలియాస్ జనార్దన్ మాట్లాడుతూ ప్రజాయుద్ధనౌక గద్దర్ అన్న ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు.గద్దర్ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లి, ఆయన ఆశయాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం గద్దర్ చేసిన పోరాటాన్ని కొనసాగిస్తూ, సామాజిక న్యాయం సాధనలో ప్రజలను భాగస్వాములను చేస్తామని వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్, ప్రజాసంఘాల నాయకులు, సత్యశోధక్ సమత సమాజ్ సంఘం సభ్యులు, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రామన్న, ఆయా పార్టీల నాయకులు, గద్దర్ అన్న విగ్రస్థాపన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

2029లో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం: సీఎం రేవంత్ రెడ్డి

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత

మహిళల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు ఉపాధి కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. కోటి మంది మహిళలకు నాణ్యమైన చీరలు పంపిణీ చేశామని, నవంబర్ 26న రెండో విడత ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పొందుతున్న 36 లక్షల మంది మహిళల కోసం ఇప్పటివరకు రూ.13 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 16 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.

రైతులు, యువతకు భరోసా

రైతులకు ఒకే విడతలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రూ.20 వేల కోట్లు ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, వ్యవసాయ రంగంపై రూ.1.78 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని చెప్పారు. యువతకు ఇప్పటివరకు 75 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు.

మల్లన్నసాగర్ నిర్వాసితులకు హామీ...

మల్లన్నసాగర్ నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, అధికారులు వారి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారని సీఎం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని పూర్తిస్థాయిలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

కృష్ణా జలాల విషయంలో గత పాలకుల వల్ల తెలంగాణకు అన్యాయం జరిగిందని సీఎం విమర్శించారు. 2015లో తెలంగాణకు 299 టీఎంసీల కృష్ణా జలాలు సరిపోతాయని పేర్కొన్నది అప్పటి పాలకులేనని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు.

సభలో ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే పథకం పేదలకు భరోసా ఇస్తుందని అన్నారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని, రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. కొత్తగా నాలుగున్నర లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి, గండేపల్లి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్వాసితులకు పెండింగ్ పరిహారం చెల్లించాలని కోరారు. మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ మదన్ మోహన్ రావు సేవలను గుర్తిస్తూ అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషకరమన్నారు.

కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కాలనీలో పార్కు స్థలం కాపాడిన హైడ్రా

2,924 గజాల స్థలానికి ఫెన్సింగ్ • కోర్టు పరిధిలోని ఇంటికి మినహాయింపు

కీసర, నవంబర్ 19 (జనంసాక్షి) : రాంపల్లి పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో పార్కు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను హైడ్రా పరిరక్షించింది. ఆక్రమణలు తొలగించి మొత్తం 2,924 గజాల స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. క్యూర్ పరిధిలో చెరువుల పరిరక్షణతో పాటు పార్కులు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం కీసర మండలం రాంపల్లి గ్రామ పరిధిలోని శ్రీనివాస్ కాలనీలో సర్వే నంబరు 414/105లో ఉన్న 1,127 గజాల ప్రజావసరాల స్థలం, 1,797 గజాల పార్కు స్థలాన్ని పరిరక్షించింది. మొత్తం 2,924 గజాల స్థలంలో ఆక్రమణలను తొలగించి ఫెన్సింగ్ వేసింది. 1980వ దశకంలో రూపొందించిన ఈ లేఅవుట్‌లో పార్కులు, ప్రజావసరాల కోసం స్థలాలను కేటాయించారు. అయితే వాటిని నోటరీ ద్వారా ప్లాట్లుగా విభజించి విక్రయించారు. కొనుగోలుదారులు ప్రీకాస్ట్ గోడలు నిర్మించి స్థలాలను ఆక్రమించారు. సుమారు 300 గజాల్లో ఓ ఇంటిని కూడా నిర్మించారు. ఈ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయగా, ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. దీంతో ఆ ఇంటిని మినహాయించి మిగిలిన ఆక్రమణలను తొలగించిన హైడ్రా.. పార్కు, ప్రజావసరాల స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.







విద్యార్థుల చేతుల్లో పేక ముక్కలపై కలెక్టర్ విచారణ





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : షాద్‌నగర్ గిరిజన వసతి గృహంలో విద్యార్థుల పుస్తకాల పక్కన పేక ముక్కలపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ మేరకు విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో ఏఎస్‌డబ్ల్యూఓ మాధవ్ గౌడ్ చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ పట్టణంలోని గిరిజన వసతి గృహంలో హాస్టల్ వార్డెన్‌తో పాటు విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో ఇలాంటి వికృత చేష్టలు చేయడమేంటని విద్యార్థులను నిలదీశారు. ఇలాంటి విద్యాలయాల్లో అలాంటి రీల్స్ చేయడం సమంజసం కాదని హెచ్చరించారు. ఇక్కడ జరిగిన వివరాలను నివేదిక రూపంలో జిల్లా అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. పుస్తకాల పక్కన పేక ముక్కలు అని జనంసాక్షి ప్రచురించడంతో గురువారం రోజున అధికారులు స్పందించి చర్యలకు పూనుకున్నారు. వసతి గృహంలో ఇలాంటి పరిస్థితి చోటుచేసుకోవడం, రీల్స్ చిత్రీకరించడంపై అధికారుల పర్యవేక్షణ లేదని స్థానికులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాబాటలో హబ్సిగూడ సర్కిల్ ఎస్ఈ పి. వెంకన్న



జవహర్‌నగర్, నవంబర్ 19 (జనంసాక్షి) : హబ్సిగూడ సర్కిల్, బాలాజీ నగర్ సెక్షన్ పరిధిలోని బజరంగ్ నగర్ కాలనీలో గురువారం 'ప్రజాబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) పి. వెంకన్న, కీసర ఏడీఈ (ఎడిఈ) నందకిషోర్, బాలాజీ నగర్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) హెచ్. సాంబశివరావు విద్యుత్ శాఖ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ పి. వెంకన్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి ఇంద్రసేన రావు స్థానిక విద్యుత్ వినియోగదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వినియోగదారులకు హామీ ఇచ్చారు.

ఇందిరా గాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయం



జవహర్‌నగర్ నవంబర్ 19 (జనంసాక్షి): భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను జవహర్‌నగర్ డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, మహిళా సాధికారత కోసం ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, బల్లి శ్రీనివాస్, కల్లేపల్లి సదానందం, అనంతలక్ష్మి, మాట్ల వినయ్, అబ్బాగోని రాజు గౌడ్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్, పొలాస కిరణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట(జనంసాక్షి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ దేశానికి అందించిన సేవలను, దేశ సమగ్రత, ఐక్యత కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు.పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని అన్నారు.దేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ధైర్యసాహసాల నాయకురాలిగా, మహిళా శక్తికి ప్రతీకగా ఇందిరా గాంధీ ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని అన్నారు.ఇందిరా గాంధీ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తి ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శమని, ఆమె చూపిన మార్గంలో పయనిస్తూ ప్రజాసేవకు అంకితమై పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ చేయూత పెన్షన్లు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
సూర్యాపేటలో 2102 మందికి పెన్షన్లు మంజూరు

సూర్యాపేట(జనంసాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏఐసీసీ సభ్యులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని రవిమహల్‌లో జరిగిన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు పెన్షన్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.గత బీఆర్ఎస్ పాలనలో పింఛన్లు అందక అనేక మంది అర్హులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా లక్షలాది మందికి పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు.సూర్యాపేట పట్టణంలో 2102 చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు.అర్హులైన లబ్ధిదారులందరికీ మంజూరు పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు.అర్హులందరికీ చేయూత పింఛన్లు అందించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఇందులో మధ్యవర్తుల ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు.అర్హత ఉన్నవారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ,, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తోందని వివరించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల సహకారం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ షఫీవుల్లా, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

